క్లుప్తంగా

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

సత్తుపల్లి/వైరా: సత్తుపల్లి, వైరా నియోజకవర్గ ప్రజలకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరం ప్రజలు సుఖ సంతోషాలు వెల్లివిరియాలని తెలిపారు. అదేవిధంగా తనకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే ఎవరైన బొకేలు, మిఠాయిలు తీసుకురావొద్దని.. వాటి బదులుగా నిరుపేదలకు పంచడానికి దుప్పట్లు తీసుకురావాలని సూచించారు.

పేదలకు అండగా ఎర్రజెండా



బందెల పాల్ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వైరా: దోపిడీ ఉన్నంత కాలం పేదల పక్షాన ఎర్రజెండా అండగా ఉటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో శనివారం సీపీఎం సీనియర్ నాయకుడు బందెల పాల్ సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు రాంబాబు, నాయకులు నాగేశ్వరావు, కుటుంబరావు, సమత, రవీందర్, చలపతిరావు, రామారావు, పాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ముక్కోటి'కి ఏర్పాట్లు పూర్తి

వైరా : పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం జరిగే ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అర్చకులు ఆరుట్ల సతీష్‌కుమారాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామునే స్వామివారిని ఉత్తర ద్వారంలో వేంచేపు చేస్తామని, ఈ ద్వారం నుంచి దర్శనం చేసుకోవడం ఎంతో పుణ్యఫలమని పేర్కొన్నారు.

ఇంటింటికీ స్వీట్లు, క్యాలెండర్ల పంపిణీ



స్వీట్లు, క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మట్టా ప్రసాద్

సత్తుపల్లిటౌన్: నూతన సంవత్సరం సందర్భంగా వార్డు ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ ఇంటింటికీ స్వీట్లు, నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొంగరి రమేష్, మేకల నర్సింహారావు, బుడేన్, మిద్దే శ్రీను, వలీ, భూషణం, వెంకటేశ్వరరావు, గౌసుద్దీన్, మారేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ 2022వ సంవత్సరంలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా పాఠశాలకు హాజరైన హిందీ పండిట్ భూక్యా వెంకటేశ్వర్లును శనివారం పాఠశాలలో హెచ్‌ఎం సోమ్లా, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

లైట్లు పంపిణీ

కారేపల్లి: సింగరేణి బొగ్గుగనుల సంస్థ ఇల్లెందు ఏరియా జీఎం ఆధ్వర్యంలో ఓసీ ప్రభావిత ప్రాంత పోలంపల్లి గ్రామ యువతకు రూ.20 వేల విలువ చేసే 150 వాట్స్ గల రెండు లైట్లను శనివారం పంపిణీ చేశారు. గ్రామ యువత షటిల్ కోర్టును ఏర్పాటు చేయడంతో ఈ లైట్లను అందించడం జరిగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉమా శంకర్, ప్రధాన కార్యదర్శి బన్సిలాల్, ధోనీ నాయక్, సర్పంచ్ కుమార్, సొసైటీ డైరెక్టర్ రోషయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేత

వైరా రూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమాన్ని శనివారం వైరా న్యూలిటిల్ ఫ్లవర్, షైన్ స్కూల్ విద్యార్థులు సందర్శించి అనాథ మహిళలు, వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ పి.భూమేష్‌రావు, సుమన్, సీనియర్ సెకండరీ ప్రిన్సిపాల్ భువన ప్రసాద్, ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ, షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశా, ఏఓ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్..

- కేకులు, బిర్యానీలకు ఫుల్ గిరాకీ
- రంగులు, రంగవల్లులతో మహిళలు బిజీ
- యువత కేరింతలు



రంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం





స్వీటు దుకాణం వద్ద కొనుగోళ్ల సందడి.. (ఇన్‌సెట్) బిర్యానీ పార్శిల్ చేస్తూ..

సత్తుపల్లిటౌన్: న్యూ ఇయర్‌రానే వచ్చింది.. యువత ఉరకలేస్తూ కొత్త సంవత్సరం 2023కు ఘనంగా స్వాగతం పలికింది. శనివారం మధ్యాహ్నం నుంచే సత్తుపల్లిలో కేకులు, బిర్యానీ దుకాణాలు, స్వీట్లు, రంగుల దుకాణాలు కొనుగోళ్లతో సందడి నెలకొంది. కరోనా కారణంగా రెండేళ్ల పాటు న్యూ ఇయర్ వేడుకలను ఆడంబరంగా జరుపుకోలేకపోయిన ప్రజలు ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో స్వాగతం పలికారు. నూతన సంవత్సరం రోజున నూతన వస్త్రాలు ధరించేందుకు వస్త్రదుకాణాలు కిటకిటలాడాయి.

యువత జోష్..

కేక్‌లు కట్ చేయడం.. బాణాసంచా కాల్చటం.. నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ న్యూ ఇయర్‌ను స్వాగతిస్తూ జోష్‌లో యువత సందడి చేసింది. కొందరు యువకులు బైక్‌లను అతివేగంగా సైలెన్సర్లను తొలగించి మరీ నడుపుతూ ఆనందంలో మునిగిపోయారు. ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారడంతో న్యూ ఇయర్ కళ సంతరించుకుంది. బేకరీల్లో వివిధ ఆకృతుల్లో కేకులు తయారు చేయటంతో కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు. ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రధాన రహదారుల వెంట స్వీట్లు, కేకులు, రంగుల అమ్మకాలు జోరుగా సాగాయి.

ఆఫర్లతో బిర్యానీలు..

కొత్త సంవత్సరాన్ని బిర్యానీ ఘుమఘుమలు ఆస్వాదించేందుకు ప్రజలు ఆసక్తి చూపటంతో బిర్యానీ దుకాణాలు, రెస్టారెంట్లు రద్దీగా మారాయి. శని, ఆదివారాల్లో ఫ్యామిలీ ప్యాక్‌లు, జంబోప్యాక్‌ల బిర్యానీలు కొనుగోలు చేస్తే కూల్ డ్రింక్‌లు ఉచితంగా ఇస్తామని ఆఫర్లు ప్రకటించాయి. మందుబాబులు మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కార్యాలయాలలో కేక్ కటింగ్‌లతో సందడి నెలకొంది.

ఆదరణ బాగుంది..



బిర్యానీలకు ఆదరణ బాగుంది. కొత్త సంవత్సరం ముందు రోజు నుంచి బిర్యానీ తినేందుకు ప్రజలు ఎక్కువగా ఉత్సాహం చూపిస్తున్నారు. పదేళ్లుగా నాణ్యమైన బిర్యానీలను అందిస్తున్నాం. మా వద్ద రకరకాల బిర్యానీలను అందుబాటులో ఉంచాం.

– జి.వీరారెడ్డి, ట్రీట్ రెస్టారెంట్, సత్తుపల్లి

అమ్మకాలు బాగున్నాయి..



ఈ ఏడాది కేక్‌ల అమ్మకాలు బాగున్నాయి. గత రెండేళ్లుగా కరోనా ప్రభావం ఉంది. ప్రస్తుతం ఈ ఒక్కరోజే సుమారు 800 వరకు కేక్‌లను సిద్ధం చేశాం. నాలుగు వందల కేక్‌లు ఆర్డర్లపై వెళ్లాయి. సుమారు పది రకాల కేక్‌లు తయారు చేశాం.

– మహదేవ సురేష్, రూపా బేకరి, సత్తుపల్లి

పేదింటి మహిళలకు కల్యాణలక్ష్మి వరం



కొణిజర్ల: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

కొణిజర్ల: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి మహిళలకు కొండంత అండ అని వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ అన్నారు. శనివారం మండలంలోని బస్వాపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 82 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 9 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. తహసీల్దార్ దొడ్డారపు సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, ఎంపీపీ మధు, జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, ఆత్మ చైర్మన్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రత్నం, సొసైటీ అధ్యక్షుడు రవి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చిరంజీవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ..

వైరా: వైరా మండల పీఆర్‌టీయూ శాఖ నూతన క్యాలెండర్‌ను శనివారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ సభ్యురాలు కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ రత్నం, ఆత్మ చైర్మన్ శ్రీను, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెలిశెట్టి నరసింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ బిడ్డను గెలిపించాలి



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఎర్రుపాలెం: రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీకి చెందిన వారైనా మాదిగ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులందరూ స్థానిక మామిడితోటలో పర్ణశాల పేరుతో వన మహోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణమాదిగ హాజరై ప్రసంగించారు. మధిర నియోజకవర్గంలో 50వేల ఓట్లకు పైగా మాదిగ బిడ్డల ఓట్లున్నాయని, ఏ పార్టీలో ఉన్నా.. మాదిగ బిడ్డను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి ప్రభాకర్ మాదిగ, మండల కమిటీ అధ్యక్షుడు మేకల వరయ్య, స్థానిక చర్చి ఫాదర్ చిట్టిబాబు, సర్పంచ్ కూరపాటి సుందరమ్మ, ఎంపీటీసీ కూరపాటి యశోద, కూరపాటి రమేష్, మేకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖాబాయి

ఏన్కూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖాబాయి కోరారు. మండలంలోని శ్రీరాంపురంతండాలో తిమ్మారావుపేట అంగన్‌వాడీ సెక్టార్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించాలని, చిన్నారులకు వ్యాక్సిన్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు..



సత్తుపల్లి: కిష్టారం ఓసీలో కేక్‌కట్ చేస్తున్న పీఓ నర్సింహారావు



ముదిగొండ పంచాయతీ కార్యాలయంలో..

సత్తుపల్లి/వైరా/ముదిగొండ/ఏన్కూరు: సత్తుపల్లి కిష్టారం ఓసీలో, వైరా ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో, ముదిగొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో, ఏన్కూరులోని శ్రీరాంపురంతండ ప్రాథమిక పాఠశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు పీఓ నర్సింహారావు, ఠాగూర్ విద్యాసంస్థల చైర్మన్ సునీత, కరస్పాండెంట్ రవికుమార్, డైరెక్టర్ సంయోగిత, సర్పంచ్ మందరపు లక్ష్మి, వెంకన్నలు కేక్ కట్ చేసి విద్యార్థులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇంజనీర్ మాధవరావు, రక్షణ అధికారి గోపికిషోర్, జాన్‌బాబు, సూర్యప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి సంపత్, వార్డు మెంబర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

మధిర: ప్రగతి భవన్ ముట్టడికి తరలి వెళుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులను మధిర టౌన్, రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మధిర నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అద్దంకి రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో నాగార్జున, సతీష్, రాజా, కోటేశ్వరరావు, భూపతిరావు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా మొక్క పోచమ్మకు బోణాలు

తల్లాడ: తల్లాడ మండలం నరసింహారావుపేట గ్రామంలో శనివారం మొక్క పోచమ్మ 6వ వార్షికోత్సవం సందర్భంగా పోచమ్మ తల్లికి ఘనంగా బోణాలు సమర్పించారు. గ్రామంలో మహిళలు వివిధ రకాల పిండి వంటలు, పొంగళ్లు తయారు చేసుకొని బోణంతో ఊరేగింపుగా కాటన్ పార్క్ వద్ద మొక్క పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు అనిపెద్ది సుబ్రహ్మణ్య శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మధిర: పట్టణంలోని మానసిక వికలాంగుల సేవాసదనానికి శ్రీనిధి విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌కు సంబంధించిన విద్యార్థులు వసంతమ్మ మానసిక వికలాంగుల సేవాసదనంలో ఉన్న విద్యార్థులతో కలిసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా నగదుతో పాటు మానసిక వికలాంగులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డైరెక్టర్ చందు, సేవాసదనం సిబ్బంది కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

డీసీసీబీ ఆధ్వర్యంలో..



కల్లూరు: క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం కల్లూరు బ్రాంచ్‌లో నూతన సంవత్సరం 2023 క్యాలెండర్, డైరీలను డీసీసీబీ మేనేజర్ ఎస్.రాణి, కల్లూరు సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణ్‌రావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాణి మాట్లాడారు. సహకార మిత్ర డిపాజిట్ పథకం నేటి నుంచి నూతనంగా ప్రారంభం కానుందని, ఈ పథకంలో 333 రోజుల పాటు నగదు డిపాజిట్ చేసినట్లైతే 7.5 శాతం వడ్డీ వస్తుందన్నారు. సీనియర్ సిటిజెన్స్‌కు ఐతే 8 శాతం వడ్డీ వస్తుందన్నారు. డిపాజిట్ల పై డీఐసీజీసీ ఇన్సూరెన్స్ సౌకర్యం రూ. 5 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పుష్ప, సీఈఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ జానిమియా, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ..



ఎర్రుపాలెం: యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు

ఎర్రుపాలెం: మండలపరిషత్ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఎంపీడీఓ శ్రీనివాసరావు, యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజారావు, అజయ్‌కుమార్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగమణి, సీతారామలక్ష్మి, రవికుమార్, చిన్ని, మహేంద్ర, సైదారావు, వెంకమ్మ, శంకర్, రాము, పాండు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో..

ముదిగొండ: ముదిగొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సమినేని హరిప్రసాద్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పోట్ల ప్రసాద్, మీగడ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు వెంకన్న, సీతారామయ్య, వెంకట్‌గౌడ్, రమేష్, సతీష్, మల్లయ్య, శరత్, అమరయ్య పాల్గొన్నారు.

నరేష్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి



తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్‌కు ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘం, అయ్యప్ప భక్తులు

అయ్యప్పస్వామిని దూషించిన బైరి నరేష్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని శిక్షించాలని కోరుతూ శనివారం మండలకేంద్రంలోని అయ్యప్పభక్తులు, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లలో, తహసీల్ కార్యాలయాలలో శనివారం తహసీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

బోనకల్ : మండలంలోని రాయన్నపేట గ్రామంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది.150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్ మాట్లాడారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్‌కుమార్, ప్రమోద్‌కుమార్, సాంబశివరావు, క్యాంప్ నిర్వాహకులు ఆకెన పవన్, అమర్‌నథ్, గిరి, నాగజ్యోతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

తల్లాడ: తల్లాడలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కోశాధికారి కర్నాటి లక్ష్మారెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఆర్‌సీ శ్రీనివాసరావు, డీసీ వెంకటేశ్వర్లు, నరసింహారావు, సర్వేశ్వరరావు, రామలక్ష్మణ్, పసుమర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో పాల్గొనండి

పెనుబల్లి: జనవరి 4న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్న యువజన ఉత్సవాల కళాకారుల ఎంపికలో పెనుబల్లి మండల యువత పాల్గొనాలని ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి తెలిపారు. మండల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



మధిర: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మధిర: పట్టణంలోని వర్తక సంఘంలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 16వ రోజు శనివారం నాయక్ నాయ్ ఆశ్రమం ద్వారా పాలకొలను మేలుకొలుపు, గోపూజ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరామ రామానుజ సుప్రభాత సంఘం మధిర వారి ఆధ్వర్యంలో అర్చకులు సీతారామాచార్యులు, ముడుంబ రవి కిరణ్ ఆచార్యులు వేద మంత్రోచ్చరణలతో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల తిరుపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామనుజుల వారికి అభిషేకం, అష్టోత్తర పూజలు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతన్న తిరుప్పావై ప్రవచనాలు శనివారం 16వరోజు కార్యక్రమంలో ఆచార్య పాసురం వైభవంగా జరిగింది. రామనుజుల వారికి అభిషేకం, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య మాట్లాడుతూ.. భగవంతుని నేరుగా ఎప్పుడు సేవించకూడదని భగవజ్ఞనం కలిగిన వారితో ముందు సహవాసం చేసి భగవంతుని గురించి బాగా విని ఆ తర్వాత ఆచార్యుని సేవించి ఆచార్యుడి దగ్గర ఘంత్రాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కనుమరుగైన గ్రీటింగ్ కార్డ్స్

- ఒకప్పుడు భలే గిరాకీ.. నేడు జాడ కరువు
- కాలంతో పాటు పరుగెడుతున్న యువత
- సోషల్‌మీడియా వేదికగా నూతన సంవత్సర వేడుకలు



గ్రీటింగ్ కార్డులు

వైరారూరల్: కొత్త సంవత్సరం వస్తోందంటే వారం పది రోజుల ముందు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గ్రీటింగ్‌కార్డులు, రంగుల దుకాణాల వద్ద సందడి నెలకొని ఉండేది. ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్‌కార్డులు కొనుగోలు చేసి వారం ముందే పోస్టుల్లో పంపేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి స్వయంగా ఇచ్చేవారు. గ్రామీణ ప్రాంతాల్లో హీరో, హీరోయిన్ల ఫొటోలతో కూడిన గ్రీటింగ్స్‌కు మంచి గిరాకీ ఉండేది. నచ్చిన హీరో, హీరోయిన్ల ఫొటోలను మార్చుకుంటూ చిన్నారులు సంబురంగా గడిపేవారు. కానీ.. నేడు పరిస్థితి మారింది. గ్రీటింగ్‌కార్డులు కనుమరుగయ్యాయి. వాటికి గిరాకీ లేకపోవడంతో వ్యాపారులు కూడా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు.


గతంలో ఇలా..

గతంలో నూతన సంవత్సరం వస్తుందంటే.. మొదటి ప్రాధాన్యత గ్రీటింగ్ కార్డులకు ఇచ్చేవారు. రూ. 5 నుంచి రూ. 500 వరకు కూడా గ్రీటింగ్‌కార్డులు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఒకప్పుడు గ్రీటింగ్ కార్డులపై నచ్చిన సినీ నటులు, పలు ఆటలకు సంబంధించిన క్రీడాకారులు, పలు రకాల పుష్పాలు, అదే విధంగా దేవుళ్లతో పాటు చారిత్రక కట్టడాలు అయిన తాజ్‌మహల్, గోల్కొండకోట, చార్మినార్ వంటి బొమ్మలతో ముద్రించిన గ్రీటింగ్‌కార్డులు మార్కెట్‌లలో లభించేవి. వాటికి ఆకర్షితులైన యువత వారికి నచ్చిన కార్డులను కొనుగోలు చేసి మరి న్యూఇయర్ వేడుకలను జరుపుకునేవారు. కానీ ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

మొత్తం సోషల్ మీడియానే..

ప్రస్తుతం హ్యాపీ న్యూ ఇయర్ అంటూ వాట్సాప్ మేసేజ్‌కు పరిమితమయ్యారు. అంతేకాకుండా గూగుల్‌లోనే పలు రకాల గ్రీటింగ్‌కార్డులు లభ్యమవుతున్న నేపథ్యంలో.. స్మార్ట్‌ఫోన్లలో లభ్యమవుతున్న వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, జీమెయిల్ లతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. సందేశాలను సిద్ధం చేసుకుంటున్నారు. కాలంతో పాటు యువత ఎంత వేగంగా మారుతున్నారో తెలుసుకోవచ్చు. గ్రీటింగ్‌కార్డుల జాడ కనబడనందున ప్రతి ఒక్కరు సోషల్ మీడియా వేదికగా న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. అంతేకాకుండా దూర ప్రాంతాలలో ఉన్న వారిని సైతం ఈ సోషల్ మీడియా ద్వారా క్షణాల్లో విషెస్ చెబుతున్నారు.


జ్ఞాపకాలుగానే పాత రోజులు..



పాతకాలంలో కార్డుల ద్వారా గ్రీటింగ్ తెలుపుకునేవాళ్లం. వారం ముందు నాకు మిత్రులు పోస్టుకార్డు ద్వారా గ్రీటింగ్ పంపేవారు. దగ్గరున్న వారికి స్వయంగా శుభాకాంఓలు తెలుపుకునేవాళ్లం. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితులు చూద్దామనుకున్న కనబడం లేదు. గ్రీటింగ్‌కార్డులకు గిరాకీ బాగా తగ్గింది.

– కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంఈఓ, వైరా

సోషల్ మీడియా వేదికగా..



ప్రస్తుతం ప్రతీ వేడుకకు సోషల్ మీడియా వేదికగా మారింది. స్మార్ట్ ఫోన్లలో పలు రకాల యాప్‌లో అందుబాటులో ఉండడమే కాకుండా గూగుల్‌లో గ్రీటింగ్ కార్డులు లభ్యమవుతున్న నేపథ్యంలో.. వాట్సాప్, ఇన్‌స్టాగామ్ తదితర యాప్‌లలో వాటిని షేర్ చేసుకోని న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.

– షేక్. నాగుల్ పాషా, వైరా